




# కెరటం న్యూస్
(సామాన్యుడి ఆయుధం)







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 325 | శనివారం 20 డిసెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


### ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ అప్‌డేట్.. ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణ పొడిగింపు



### ఫ్రీలాంచ్ ఆఫర్ల పేరుతో మోసం..
జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరెస్టు



### అమెరికాలో ఘోర ప్రమాదం..
బిజినెస్ జెట్ కూలి పలువురు మృతి



### అప్పులపైనే ఆధారం.. నవంబర్ నాటికే 107% అప్పులు



### కర్ణాటక ఆర్టీసీ దివాలా!.. 4 వేల కోట్ల బకాయిలు



### మరోసారి భారత్‌లో ఉగ్రదాడులకు కుట్రలు
యాక్టివ్‌గా మహిళా విభాగం



### త్వరలోనే నాకు మంత్రి పదవి వస్తుంది
కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



## తలసీమియా చికిత్సకోసం వెళ్తే హెచ్ఐవీ సోకింది
### రక్త మార్పిడితో ప్రమాదంలో చిన్నారుల జీవితాలు



న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్): మధ్యప్రదేశ్ రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తలసీమియా తో బాధపడుతున్న ఐదుగురు చిన్నారులు చికిత్స కోసం వెళ్లగా.. వైద్యుల నిర్లక్ష్యం ఆ పిల్లలకు జీవితాన్నే లేకుండా చేసింది. చికిత్సలో భాగంగా వైద్యులు ఆ చిన్నారులకు హెచ్ఐవీ సోకిన రక్తం ఎక్కించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది.

సత్నా కు చెందిన కొందరు చిన్నారులు తలసీమియా వ్యాధితో బాధపడుతున్నారు. తల్లిదండ్రులు వారిని సత్నాలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పిల్లల్ని పరీక్షించిన వైద్యులు వారికి రక్తమార్పిడి చేశారు. 150 మందికి పైగా దాతల నుండి సేకరించిన రక్తాన్ని మూడు వేర్వేరు బ్లడ్ బ్యాంక్స్ నుంచి తీసుకొచ్చి చిన్నారులకు ఎక్కించారు. ఈ రక్తమార్పిడితో చిన్నారులకు ప్రాణాంతక హెచ్ఐవీ బారిన పడ్డారు.

రక్తం ఎక్కించిన కొన్ని రోజులకే చిన్నారులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వారికి రక్త పరీక్షలు చేయగా హెచ్ఐవీ సోకినట్లు నిర్ధారణఅయింది. రిపోర్ట్స్ చూసి తల్లిదండ్రులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికీ ఈ వ్యాధి లేకపోయినా.. పిల్లలకు సంక్రమించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, వ్యాధి సోకిన సూది వాడటంగానీ లేదంటే కలుషిత రక్తాన్ని ఎక్కించడం ద్వారాగానీ ఈ వ్యాధి సంక్రమించి ఉండవచ్చని సత్నా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ దేవేంద్ర పటేల్ తెలిపారు. తలసీమియాతో బాధ పడుతున్న ఈ ఐదుగురు పిల్లలకు అనేకసార్లు రక్తమార్పిడి చికిత్స జరిగినట్లు గుర్తించారు.

## తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి
### 150 విమానాలు రద్దు



న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శుక్రవారం ఉదయం గాలి నాణ్యత సూచిక 380కి పడిపోయింది. తీవ్ర కాలుష్యంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యానికి తోడు నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీంతో విజిబిలిటీ దారుణంగా పడిపోయింది. ఫలితంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దృశ్యమానత పడిపోవడంతో శుక్రవారం ఉదయం ఢిల్లీకి రాకపోకలు సాగించే దాదాపు 152 విమానాలు రద్దయ్యాయి. వాటిలో 79 డిపార్చర్స్ కాగా, 73 అరైవల్స్ ఉన్నాయి. మరికొన్ని విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులకు ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పలు విమానాలు రద్దుకాగా, మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నట్లు తెలిపింది.

# మంత్రులపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు గరం..!
## శాఖలు మార్చాలని హైకమాండ్‌కు ఫిర్యాదు




- సొంత పార్టీ నుంచే మంత్రులపై అసంతృప్తి వెల్లువ
- శాఖలు మార్చాలని హైకమాండ్‌కు ఎమ్మెల్యేల ఫిర్యాదులు
- మంత్రుల ఇళ్ల వద్ద అవమానకర వ్యవహారం – ఎమ్మెల్యే ఆవేదన
- నియోజకవర్గ పనులకే వెళ్లినా నిర్లక్ష్యమేనని ఆరోపణలు
- యువ ఎమ్మెల్యేల లిఖిత పూర్వక కంప్లయింట్లు
- సీనియర్లకూ టైం కరువు – గర్వమే కారణమా?
- మంత్రివర్గ ప్రక్షాళన ప్రచారానికి బలం పెరుగుతుందా?

మంత్రులపై విపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు కోపంగా ఉండటం సహజం. కానీ సొంత పార్టీ ఎమ్మెల్యేలు, లీడర్లే కొందరు మంత్రులపై గుర్రుగా ఉండటం హాట్ టాపిక్‌గా మారింది. సదరు మంత్రుల దగ్గర నుంచి ఆ శాఖలను తప్పించాలంటూ కొందరు ఎమ్మెల్యేలు.. సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది. త్వరలో మంత్రివర్గ విస్తరణ లేదా ప్రక్షాళన జరిగే అవకాశం ఉందన్న ప్రచారం నేపథ్యంలో సంబంధిత మంత్రులపై వారు కంప్లయింట్ చేసినట్లు తెలిసింది.

మిగతా 2లో

## మావోయిస్టులకు షెల్టర్.. పోలీసుల అదుపులో అర్బన్ కో-ఆర్డినేటర్ ప్రభంజన్



న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):రాష్ట్రంలో మావోయిస్టుల అరెస్టులు, అగ్ర నేతల లొంగుబాట్ల పర్వం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే శుక్రవారం పోలీసులు ఓ మావోయిస్టు అర్బన్ కో–ఆర్డినేటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మావోయిస్టులకు గుట్టుచప్పుడు కాకుండా షెల్టర్ ఇస్తున్న జన్నారం గ్రామానికి చెందిన పీడీఎస్‌యూ నేత ప్రభంజన్ ను గుర్తించి అరెస్ట్ చేశారు

## సీనియర్ నేతలే నన్ను మోసం చేశారు
### ఎమ్మెల్యే మేఘారెడ్డి హాట్ కామెంట్స్



న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్): వనపర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు తారాస్థాయికి చేరింది. పంచాయతీ ఎన్నికల వేళ పార్టీలోని సీనియర్లు తనకు అన్యాయం చేశారంటూ ఎమ్మెల్యే మేఘారెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారాయి. అధిష్ఠానం అడిగితే తాను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమని తెలిపారు. శుక్రవారం ఉదయంలో ఆయన మాట్లాడుతూ..

## 'అలాంటి ఒప్పందమేదీ జరగలేదు'
### సీఎం పదవిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య..!



న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):కర్ణాటక లో సీఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందని, డీకే శివకుమార్ సీఎం అవుతారని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా.. సీఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సీఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు. 'నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సీఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సీఎం పదవిని ఇద్దరు వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి.

## ప్రభుత్వ అంశాల్లో టీపీసీసీ చీఫ్ జోక్యం..
### సరికాదంటున్న సీనియర్లు



న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్): ఈ మధ్య పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యవహారశైలిపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన మాట్లాడిన అంశాలు అటు పార్టీలో, ఇటు ప్రభుత్వ వర్గాల్లో గందరగోళం సృష్టిస్తున్నాయి. భవిష్యత్ లో సైతం ఆయన ఇదే విధంగా వ్యవహరిస్తే వివాదాలు తలెత్తే ప్రమాదం ఉందని లీడర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రిసెంట్ గా ఢిల్లీ పర్యటనలో మహేశ్ కుమార్ మీడియాతో పిచ్చాపాటిగా పార్టీ, ప్రభుత్వంలోని అంతర్గత అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పార్టీలోని అంశాలపై అధ్యక్షుడి హోదాలో ఏమైన మాట్లాడవచ్చు. కాని ప్రభుత్వ అంశాలపై ఆయన తన అభిప్రాయాలను బయటికి చెప్పడం సరికాదని సీనియర్ లీడర్లు సూచిస్తున్నారు.

కేబినెట్ ప్రక్షాళన సీఎం పరిధిలోని అంశం

మంత్రివర్గం ప్రక్షాళన చేయడమా? ఒకవేళ చేస్తే ఎవరిని తీసుకోవాలి?ఎవరిని తప్పించాలి?ఏ మంత్రులు శాఖలు మార్చాలి?అనే అంశాలు పూర్తిగా సీఎం రేవంత్ రెడ్డి పరిధిలోనివి. ఈ విషయాలపై ఆయన అధిష్ఠానాన్ని సంప్రదించి తుది నిర్ణయం తీసుకుంటారు. అయితే పార్టీ అధ్యక్షుడి హోదాలో ఆయనకు ప్రభుత్వంలో జరిగే పరిణామాలు తెలుస్తుంటాయి.

కెరటం న్యూస్



## మావోయిస్టులకు షెల్టర్.. పోలీసుల అదుపులో అర్బన్ కో-ఆర్డినేటర్ ప్రభంజన్

మొదటి పేజీ తరువాయి

అయితే గత కొన్నాళ్లుగా ప్రభంజన్ మావోయిస్టులకు షెల్టర్ పేరిట పెద్ద ఎత్తున డబ్బు వసూళ్లకు పాల్పడుతున్నట్లుగా ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఈ మేరకు అతడిని జన్నారం నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

కాగా, తెలంగాణ పోలీసులు చేపట్టిన మేజర్ ఆపరేషన్‌లో ఏవోబీ కమాండర్ ఎర్రోళ్ల రవి తో పాటు 35 మంది మావోయిస్టులు సరెండర్ అయినట్లుగా తెలుస్తోంది. అందులో హిడ్మా బెటాలియన్ కమాండర్లు కూడా ఉన్నట్లుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇవాళ డీజీపీ కార్యాలయం నుంచి కీలక ప్రకటన వెలువడింది. మధ్యాహ్నం 2.30 గంటలకు డీజీపీ కార్యాలయంలోని టెన్నిస్ కోర్టు గ్రౌండ్‌లో డీజీపీ శివధర్ రెడ్డి మీడియా సమావేశాన్ని నిర్వహిస్తున్నారని, వార్తాపత్రికల రిపోర్టర్లు, ఫొటో, వీడియో జర్నలిస్టులు హాజరు కావాలని డీజీపీ సీపీఆర్వో శ్రీనివాస రావు మీడియాకు సమాచారమిచ్చారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో బిగ్ అప్‌డేట్.. ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణ పొడిగింపు

**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు పై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది. ధర్మాసనం ఆదేశాల మేరకు డిసెంబర్ 12న కేసులో ప్రధాన నిందితుడు మాజీ ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనానికి సిట్ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావుకు సంబంధించి వారం రోజుల కస్టోడియల్ రిపోర్టును అందజేశారు. అయితే, ఆ రిపోర్టులో చివరగా నిందితుడు విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని, మరోసారి కస్టోడియల్ విచారణ అవసరం ఉందని పేర్కొన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం ఈనెల 25 వరకు ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణను పొడిగిస్తున్నట్లుగా ప్రకటించింది.

## ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో మోసం.. జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అరెస్టు

**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** రియల్ ఎస్టేట్ రంగంలో 'ప్రీ లాంచ్ ఆఫర్' పేరుతో వేలాది మంది కొనుగోలుదారులను మోసం చేసిన జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. తాజాగా ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కాకర్ల శ్రీనివాస్ ను చెన్నైలో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. కాగా, బాధితుల ఫిర్యాదుల మేరకు తెలంగాణ పోలీసులు ఇప్పటికే కాకర్ల శ్రీనివాస్‌ను అరెస్టు చేసినప్పటికీ, బెయిల్‌పై విడుదలైన అనంతరం అతను పరారీలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసిన ఈడీ, ఇటీవల చెన్నైలో అతడిని అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకొస్తున్నట్లుగా తెలుస్తున్నది. కంపెనీ ప్రీ-లాంచ్ ఆఫర్లు, భవిష్యత్ ప్రాజెక్టుల పేరుతో జయత్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వందలాది మంది నుంచి సుమారు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి మోసం చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఇళ్లు, ఫ్లాట్లు ఇస్తామని హామీ ఇచ్చి, నిధులు సేకరించినా ప్రాజెక్టులు పూర్తి కాకుండా, రిఫండ్లు కూడా ఇవ్వకుండా మోసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈడీ ఇప్పటికే హైదరాబాద్‌లోని ఎనిమిది ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి, ముఖ్యమైన డాక్యుమెంట్లు, డిజిటల్ డివైస్‌లు స్వాధీనం చేసుకుంది. బాధితుల నుంచి సేకరించిన నిధులను షెల్ కంపెనీల ద్వారా మళ్లించినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

## సీనియర్ నేతలే నన్ను మోసం చేశారు ఎమ్మెల్యే మేఘారెడ్డి హాట్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి

పార్టీ జెండా మోసిన అనుకునే వాళ్లు నిలువునా మోసం చేశారని అన్నారు. ముందు నుంచి ఒకరు, వెనుక నుంచి మరొకరు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు.

నా వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయి..

వనపర్తి నియోజకవర్గ పరిధిలో 140 గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. అందులో తాము 85 పంచాయతీల్లో విజయం సాధించామని తెలిపారు. మరో 10 నుంచి 15 స్థానాల్లో తమ పార్టీకి చెందిన సీనియర్ నాయకులే మోసం చేశారని ఆరోపించారు. ఒకవేళ ఎలాంటి అవాంతరాలు లేకపోతే 100 పైగా స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచేదని అన్నారు. ఏ గ్రామంలో ఎవరెవరు సమస్యలు సృష్టించారనేది ప్రజలకు, పార్టీ పెద్దలకు లెక్కలతో సహా చెబుతానని తెలిపారు. తన సారథ్యంలో అత్యధిక పంచాయతీలు గెలవకుండా కొందరు సీనియర్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ప్రోత్సహించి కుట్రలు చేశారని, అధిష్టానం అడిగితే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమని అన్నారు. జంగమయ్యపల్లి, ఉప్పరపల్లి, అప్పారెడ్డిపల్లి, గోపాల్‌పేట, పొలికపాడులో ఇలా చాలా గ్రామాల్లో జరిగిన పరిణామాలకు సంబంధించి తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని.. అవాస్తవం కాదని స్పష్టం చేశారు. మేఘారెడ్డిపై కోపం ఉంటే.. మేఘారెడ్డిని, మల్లు రవి పై కోపం ఉంటే మల్లు రవిని పొడవాలని, అంతే కానీ పార్టీకి అన్యాయం చేయడం సరికాదని మేఘారెడ్డి అన్నారు.

## మంత్రులపై సొంత పార్టీ ఎమ్మెల్యేలు గరం..! శాఖలు మార్చాలని హైకమాండ్‌కు ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

ఇంటికి వెళ్తే గంటల కొద్ది కూర్చోబెడుతున్నారు

తమ నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ఆ ముగ్గురు మంత్రుల వద్దకు వెళ్తే రిసీవ్ చేసుకునే విధానం సరిగా ఉండటం లేదని పలువురు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటికి వెళ్తే వెంటనే కలవకుండా గంటల కొద్ది కూర్చోబెడుతున్నారని, చివరకు కలిసినా పొడిపొడిగా మాట్లాడుతున్నారని, అందులోనూ అవహేళన మాటలు ఎక్కువగా ఉంటున్నాయని, ఇలా ఇప్పటికే ఐదారుసార్లు జరిగిందని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. తాము పైరవీల కోసమో, సొంత పనుల కోసమో మంత్రుల వద్దకు వెళ్లడం లేదని, నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం వెళ్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి అనుభవం తన ఒక్కరికే కాదని, కొత్తగా ఎన్నికైన మెజార్టీ ఎమ్మెల్యేల్లో ఉందని ఆయన వివరించారు.

అధిష్టానానికి ఫిర్యాదు

సదరు మంత్రుల పనితీరుపై విసిగి పోయిన కొందరు యువ ఎమ్మెల్యేలు.. సీఎం రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో పాటు కాంగ్రెస్ అధిష్టానానికి సైతం లిఖిత పూర్వకంగా కంప్లైట్ ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఈ విషయాన్ని దక్షిణ తెలంగాణకు చెందిన ఓ యువ ఎమ్మెల్యే వివరించారు. 'మేం కూడా వాళ్లతో సమానంగా ఎమ్మెల్యేలమే. ప్రజలు ఓట్లు వేస్తేనే గెలిచాం. మాకే టైం ఇవ్వకపోతే, సాధారణ ప్రజలను ఎలా కలుస్తారు?' అని ప్రశ్నించారు.

సీనియర్ లీడర్లకు సైతం అదే అనుభవం

పార్టీకి చెందిన సీనియర్ లీడర్లకు సైతం సదరు మంత్రులు టైం ఇవ్వడం లేదనే ఫిర్యాదులున్నాయి. 'ఆ మంత్రులకు చాలా గర్వం. ఫోన్ లిఫ్ట్ చెయ్యరు. వెళ్తే కలవరు. ఇట్లా ఉంటే పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తది. వాళ్లను ఆయా శాఖల నుంచి తప్పించాలి. కొత్త వాళ్లకు కేటాయించాలి' అని దక్షిణ తెలంగాణకు చెందిన ఓ సీనియర్ లీడర్ తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. ఈ విషయాలపై పార్టీ పెద్దలకు లేఖ రాసినట్టు ఆయన వెల్లడించారు.

## ప్రభుత్వ అంశాల్లో టీపీసీసీ చీఫ్ జోక్యం.. సరికాదంటున్న సీనియర్లు

మొదటి పేజీ తరువాయి

ప్రక్షాళన చేసే ముందు అధిష్టానం కూడా ఆయన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని చాన్స్ ఉంటుంది. అయితే ఈ విషయాలు ఆయనకు తెలిసినా బయటికి చెప్పకుండా మహేశ్ కుమార్ జాగ్రత్త పడాల్సి ఉంటే బాగుండునని సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. అలాకాకుండా కేబినెట్ ప్రక్షాళన ఉంటుందని చెప్పడం వల్ల ప్రభుత్వ వ్యవహారాల్లో ఆయన జోక్యం చేసుకుంటున్నారనే సంకేతాలు వెళ్లాయని అంటున్నారు. అలాగే ఐఏఎస్ అధికారుల పనితీరుపై కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిజానికి అధికారుల పనితీరును అంచనా వేయాల్సింది సీఎం,మంత్రులు. కాని మహేశ్ కుమార్ గౌడ్ బహిరంగంగా అధికారుల పనితీరు పై కామెంట్స్ చేయడం వల్ల అపోజిషన్ కు అస్త్రాలు అందించినట్లేనని కామెంట్స్ ఉన్నాయి.

## అమెరికాలో ఘోర ప్రమాదం.. బిజినెస్ జెట్ కూలి పలువురు మృతి

**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** అమెరికాలో ఘోర ప్రమాదం జరిగింది. బిజినెస్ జెట్ కూలి పలువురు మృతి చెందారు. దేశంలోని నార్త్ కరోలినాలో ఈ ప్రమాదం జరిగింది. స్టేట్స్ విల్లే రీజనల్ ఎయిర్ పోర్టులో సెసనా c 550జెట్ ను ల్యాండ్ చేసేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలింది. వెంటనే జెట్ నుంచి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ప్రమాదంలో పలువురు మృతి చెందినట్లుగా అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. ప్రమాదంలో ఎంతమంది చనిపోయారన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. ఈ ప్రమాదం కారణంగా ఎయిర్ పోర్టును తాత్కాలికంగా మూసివేశారు. ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డవ్వగా.. అవి సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా.. జెట్ క్రాష్ అవ్వడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

## తీవ్ర కాలుష్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి.. 150 విమానాలు రద్దు

మొదటి పేజీ తరువాయి

ప్రయాణికులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ముందు ఫ్లైట్ స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని సూచించింది. ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు విమానయాన సంస్థలు కూడా తమ ప్రయాణికులకు ఇలాంటి సూచనలే చేశాయి. ప్రస్తుతం ఢిల్లీ-ఎన్సీఆర్, నోయిడా, ఘజియాబాద్‌లో దృశ్యమానత 100 మీటర్లుగా ఉంది.

ఢిల్లీలోని 39 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లలో ఏకంగా 14 కేంద్రాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400 కంటే ఎక్కువగానే నమోదయ్యాయి. అత్యధికంగా ఆర్కే పురంలో గాలి నాణ్యత సూచిక 447గా నమోదైంది. ఆ తర్వాత ఆనంద్ విహార్, వివేక్ విహార్, సిరిఫోర్ట్ ప్రాంతాల్లో 442గా నమోదైంది. ద్వారకా సెక్టరా-8లో 429, నెహ్రూ నగర్‌లో 425, ఎన్ఎస్ఐటీ ద్వారకా ప్రాంతంలో 423, డాక్టర్ కర్ణిసింగ్ షూటింగ్ రేంజ్‌లో 423, ఓఖ్లా ఫేజ్-2లో 422గా ఏక్యూఐ లెవెల్స్ నమోదయ్యాయి.

## 'అలాంటి ఒప్పందమేదీ జరగలేదు'.. సీఎం పదవిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య..!

మొదటి పేజీ తరువాయి

గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సీఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

## తలసీమియా చికిత్సకోసం వెళ్తే హెచ్ఐవీ సోకింది రక్త మార్పిడితో ప్రమాదంలో చిన్నారుల జీవితాలు

మొదటి పేజీ తరువాయి

ఇక ఈ ఘటనపై ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జ్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను విధుల నుంచి సస్పెండ్ చేసింది. సత్నా జిల్లా ఆసుపత్రి మాజీ సివిల్ సర్జన్‌కు షోకాజు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించింది. అంతేకాదు, వివరణ సంతృప్తికరంగా లేకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, సత్నా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఏడాది మార్చి నెలలో తొలి హెచ్ఐవీ పాజిటివ్ కేసు నమోదైంది. మార్చి 20వ తేదీన 15 ఏళ్ల తలసీమియా పేషంట్‌కు హెచ్ఐవీ పాజిటివ్ వచ్చింది. మార్చి 26 నుంచి 28 వరకు మరో ఇద్దరు చిన్నారులకు హెచ్ఐవీ పాజిటివ్ వచ్చింది. ఏప్రిల్ 3వ తేదీన మరో కేసు నమోదు అయింది. ఇలా మొత్తం ఐదుగురు చిన్నారులు హెచ్ఐవీ బారిన పడ్డారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల జీవితాలతో వైద్యులు ఆటలాడుతున్నారంటూ మండిపడ్డారు.

## కర్ణాటక ఆర్టీసీ దివాలా!.. పేరుకుపోయిన శక్తి ఫ్రీ బస్సు స్కీమ్ 4 వేల కోట్ల బకాయిలు

**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** అధికారంలోకి రావడమే లక్ష్యంగా కర్ణాటకలోని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన 5 గ్యారెంటీలతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆగమాగంగా తయారైంది. ఐదు గ్యారెంటీల్లో భాగంగా తీసుకొచ్చిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం (శక్తి స్కీమ్) ఆర్టీసీ సంస్థకు గుదిబండగా మారింది. 2023లో ప్రారంభించిన శక్తి స్కీమ్ కింద మహిళలకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నప్పటికీ, ఆర్టీసీకి చెల్లించాల్సిన సుమారు రూ. 4,006.47 కోట్ల బకాయిలను మాత్రం సిద్ధరామయ్య ప్రభుత్వం అటకెక్కించింది. ఈ మేరకు అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానాన్ని బట్టి అర్థమవుతున్నది.

ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కర్ణాటక స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్ఆర్టీసీ), బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (బీఎంటీసీ), నార్త్ వెస్టర్న్ కర్ణాటక రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎన్‌డబ్ల్యూకేఆర్టీసీ), కళ్యాణ కర్ణాటక రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేకేఆర్టీసీ) దివాలా అంచుకు చేరాయి. ప్రభుత్వం సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో తాము బస్సులను నడుపలేని పరిస్థితికి వచ్చామని, సిబ్బందికి కూడా వేతనాలు ఇవ్వడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ ఆర్టీసీ ఉన్నతాధికారి వాపోయాడు. ప్రభుత్వ తీరుపై విపక్ష నేతలు మండిపడ్డారు. అలవిగాని హామీలతో ఆర్టీసీని ప్రభుత్వం కుదేలు చేస్తున్నదని ధ్వజమెత్తారు.

1800 గ్రామాలకు బస్సేది??

శక్తి స్కీమ్ ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని కల్పిస్తున్నామంటూ ఒకవైపు ప్రభుత్వం ప్రచారం చేసుకొంటున్నప్పటికీ, ఈ ఫ్రీ స్కీమ్ కారణంగా టికెట్ ధరలను పెంచారంటూ పురుషులు మండిపడుతున్నారు. బస్సు సర్వీసులను కూడా గణనీయంగా తగ్గించారంటూ మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని 1,800 గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. శక్తి పథకం వినియోగించుకోవాలంటే మహిళలు కనీసం 2 కిలోమీటర్లు నడిచి దగ్గర్లోని మండల బస్టాప్‌లకు రావాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ మేరకు ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు రవాణామంత్రి రామలింగారెడ్డి సమాధానం ఇచ్చారు. దీంతో శక్తి స్కీమ్ పూర్తిస్థాయిలో అమలు కావడంలేదని. ఇదో విఫల పథకమని విపక్షాలు మండిపడుతున్నాయి.

## అప్పులపైనే ఆధారం.. నవంబర్ నాటికే 107% అప్పులు




**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. గడిచిన నాలుగేండ్లలో ఎన్నడూ లేనంతగా రాష్ట్ర సొంత రాబడి క్షీణించింది. వార్షిక బడ్జెట్ అంచనా లక్ష్యంలో ఎనిమిది నెలలు దాటినా సగానికి కూడా చేరలేదు. ప్రతి ఏడాది బడ్జెట్ అంచనాలు పెరుగుతున్నా, వాస్తవ రూపంలో ఖజానాకు వచ్చే ఆదాయం తగ్గుతున్నది. అప్పుల భారం మాత్రం గుట్టలా పెరిగిపోతున్నది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ తాజాగా విడుదల చేసిన నవంబర్ నెల రాష్ట్ర ఆదాయ, వ్యయాల నివేదికను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతున్నది. బడ్జెట్ అంచనాలకు, వాస్తవ వ్యయాలకు మధ్య భారీ వ్యత్యాసాలు ఉండటం, వాటిని పూడ్చడానికి అప్పులపై ఆధారపడటం ఈ నివేదికలో ప్రధానంగా కనిపిస్తున్నది. ఆర్థిక సంవత్సరంలో రూ.54,009.74 కోట్ల వరకు అప్పులు చేయవచ్చని బడ్జెట్‌లో అంచనా వేసుకున్నారు. కానీ నవంబర్ నాటికే రూ.58,068.90 కోట్ల అప్పు చేశారు. కేవలం (ఏప్రిల్-నవంబర్) తొలి 8నెలల్లోనే బడ్జెట్ అంచనా కంటే 107.52%అప్పులు చేయడం ప్రభుత్వ ఆర్థిక వైఫల్యానికి అద్దం పడుతున్నది.

అదుపు తప్పుతున్న అప్పులు

అదుపు లేకుండా అప్పులు చేస్తున్న రాష్ట్ర సర్కారు.. సొంత రాబడులను పెంచుకోవడంలో మాత్రం చతికిల పడుతున్నది. 2022-23లో నవంబర్ నాటికి బడ్జెట్ అంచనాలో 49.7% అప్పులు చేశారు. 2024-25కు ఇది76.84 శాతానికి చేరింది. 2025-26 (ప్రస్తుత ఏడాది) నవంబర్ ముగిసే సమయానికే ప్రభుత్వం 107.52% అప్పులు చేసింది. అంటే, ఏడాది మొత్తానికి అనుకున్న అప్పును ఎనిమిది నెలల్లోనే దాటేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే అత్యంత ప్రమాదకర స్థాయికి సంకేతంగా ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంస్థల గ్యారెంటీలు, పబ్లిక్ అకౌంట్ నుంచి తీసుకున్న అప్పుల వివరాలను ప్రభుత్వం కాగ్‌కు సమర్పించలేదు. ఇది రాష్ట్ర అసలు అప్పుల లెకలపై అనుమానాలను కలిగిస్తున్నది.


## మరోసారి భారత్‌లో ఉగ్రదాడులకు కుట్రలు యాక్టివ్‌గా మహిళా విభాగం

**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** భారతదేశంలో పహల్గామ్ ఎటాక్, ఎర్రకోట బ్లాస్ట్ తరహా మరిన్ని దాడులు చేసేందుకు పాక్ ఉగ్రవాద సంస్థ జైష్ ఏ మహ్మద్ కుట్రలు చేస్తోంది. అయితే ఇందుకోసం పురుషులను కాకుండా మహిళా విభాగాన్ని యాక్టివేట్ చేస్తోంది. జమాత్ ఉల్ మొమినాత్ పేరుతో మహిళా ఉగ్రవాద విభాగం పనిచేస్తోంది. ఇక గురువారం పూంచ్ లైన్ ఆఫ్ కంట్రోల్ ఎల్ఓసీ వద్ద పాకిస్థాన్ మహిళ భారత్ లోకి చొరబడేందుకు ప్రయత్నించింది. ఆమెను గుర్తించి సైనికులు అదపులోకి తీసుకున్నారు. ఆ మహిళ షెహనాజ్ అక్తర్ గా గుర్తించగా పాక్ ఆక్రమిత కశ్మీర్ కు చెందిన మహిళ అని నిర్ధారించారు. విచారణలో ఆ మహిళకు జైష్ ఎ మహ్మద్ తో లింకులు ఉన్నట్టు తేలింది. అంతేకాకుండా సరిహద్దులు దాటే ముందు ఆ మహిళ పాకిస్థాన్ సైనికులతో మంతనాలు సాగించినట్టు కూడా తెలుస్తోంది. బార్డర్ దాటిన తరవాత ఆమె కలవాల్సిన వ్యక్తి గుర్తించి సైతం చర్చించినట్టు సమాచారం. ఢిల్లీ ఎర్రకోట పేలుడు ఘటనలో మహిళా ఉగ్రవాదుల విషయం బయటపడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో మహిళా డాక్టర్ తో పాటు పలువురు పట్టుబడ్డారు. ఇక మహిళా ఉగ్రవాదుల విభాగంలో ఉగ్రవాదుల భార్యలే ఉన్నట్టు తెలుస్తోంది. అంతే కాకుండా ఉగ్రవాది మసూద్ సోదరి మహిళా ఉగ్రవాదుల విభాగానికి నాయకత్వం వహిస్తున్నట్టు సమాచారం. ఇంటిలిజెన్స్ కు సమాచారం అందడంతో మహిళా ఉగ్రవాదులపై నజర్ పెంచినట్టు తెలుస్తోంది.

## త్వరలోనే నాకు మంత్రి పదవి వస్తుంది కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి


**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** మంత్రి పదవిపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అదృష్టం ఉంటే మంచి పదవి వస్తుందని అన్నారు. ఇన్ని రోజులు ఆగానని త్వరలోనే తనకు మంత్రి పదవి వస్తుందని చెప్పారు. చాలా కాలంగా రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి గురించి మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో చేరే సమయంలోనే తనకు అధిష్టానం మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందని చెప్పారు. కానీ ఇప్పుడు ఇవ్వడంలేదని అనేకసార్లు మీడియా సమావేశాల్లో అసహనం వ్యక్తం చేశారు. అంతేకాకుండా పార్టీలో జరుగుతున్న పరిణామాలపై కూడా పలుమార్లు మీడియా ముఖంగానే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నానని మంత్రి పదవి ఉంటే మరింత అభివృద్ధి చేయవచ్చని చెప్పారు. ఇక ఇప్పుడు మంత్రి పదవిపై పాజిటివ్ గా మాట్లాడటంతో కోమటిరెడ్డికి పదవిపై ఏమైనా సంకేతాలు అందాయా అనే చర్చ జరుగుతోంది.

## పంచాయతీ ఎన్నికల్లో చిత్రం.. సర్పంచ్ అభ్యర్థికి వచ్చిన ఓట్లు సున్నా



**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గెలుపు కోసం సర్పంచ్ అభ్యర్థులు ఎక్కని గడప లేదు అన్నట్లుగా ప్రచారం నిర్వహించారు. కొన్ని కొట్ల మద్యం ఏరులై పారగా.. మరికొన్నిచోట్ల డబ్బు ప్రభావం పని చేసింది. ఈ క్రమంలోనే మూడు విడత పంచాయతీ ఎన్నికల్లో ఓ చిత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ జిల్లా ఖానాపూర్ మండల పరిధిలోని కీర్యాతండా లో పంచాయతీ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. గ్రామంలో మొత్తం 239 ఓట్లు పోల్ అవ్వగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి బోడ గౌతమి కి కనీసం ఒక్క ఓటు కూడా పడలేదు. అదేవిధంగా మరో ఇద్దరు అభ్యర్థులు బాదావతు లలితకు 79 ఓట్లు, బోడ విజయకు 156 ఓట్లు వచ్చాయి. నోటాకు ఒక ఓటు పడింది. 3 ఓట్లు చెల్లుబాటు కాలేదని ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే, సర్పంచ్ అభ్యర్థి బోడ గౌతమికి ఒక్క ఓటుకు పడకపోవడం పట్ల ఆమె ఓటును ఆమె వేసుకోలేదా అని అటు గ్రామస్థులు.. చిత్రం చూసిన ప్రజలు నోళ్లు వెళ్లబెడుతున్నారు.

## 18.38 లక్షల ఉపాధి హామీ పథకం కార్డులు రద్దు



**న్యూస్ డెస్క్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఓవైపు మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్పుపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతుండగానే.. కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా దాదాపు 18.38 లక్షల MGNREGA కార్డులు రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే సాధారణంగా 3 నెలలకు ఒకసారి ఉపాధి హామీ కార్మికులను సమీక్షించి వలసదారులను, పనులకు రానివారిని, మృతులను జాబితా నుంచి తొలగించి వారి కార్డులు రద్దు చేస్తారు. కానీ ఈ ఒక్క త్రైమాసికంలోని అక్టోబర్ 10 నుంచి నవంబర్ 14 మధ్య కేవలం 5 వారాల్లోనే 11.07 లక్షల కార్డులను తొలగించడం చర్చకు దారి తీసింది. కాగా 2025-26 కు చెందిన తొలగించిన కార్డుదారుల్లో అత్యధికంగా ఏపీకి చెందిన వారే లక్షకు పైగా ఉండటం గమనార్హం. అయితే వృద్ధులు, ఈ పని ఇష్టం లేనివారు స్వచ్ఛందంగానే వారి పేర్లు తొలగించుకున్నారని అధికారులు చెబుతున్నారు.

# బీరోలు ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్ ను ఉపసంహరించాలి

## కెజిబివి యస్ఓ టర్మినేషన్ ను రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలి

## ఉపాధ్యాయ సంఘాలు



**ఖమ్మం ఎడ్యుకేషన్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** జిల్లాలో మూడు విడతల గ్రామపంచాయతీ ఎన్నికలను ఉద్యోగ, ఉపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహించారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యయప్రయాసలకోర్చి, ఎన్నికల నిబంధనలను తూచ తప్పకుండా పాటించి జిల్లాలో విజయవంతంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో ప్రత్యేకించి ఉపాధ్యాయుల కృషి శ్లాఘనీయం. ఇలాంటి సందర్భంలో కూసుమంచి మండలం చేగొమ్మ నందు జరిగిన సంఘటన పట్ల వాస్తవాలను విచారించకుండా బీరోలు ప్రధానోపాధ్యాయులు వల్లంకొండ.రవి ని అకారణంగా సస్పెండ్ చేయడాన్ని ఉపాధ్యాయ సంఘాలు నిరసించాయి. సస్పెండ్ చేసిన రిటర్నింగ్ అధికారి రవి ని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాలు జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని కలిసి శుక్రవారం వినతిపత్రం ఇచ్చాయి. ఈ సందర్భంగా ఎస్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, జెఎసి వైస్ చైర్మన్ దేవరకొండ. సైదులు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తాయని కావున సస్పెన్షన్ వెంటనే ఎత్తివేయాలని జిల్లా పాలనాధికారిని కోరారు. అదే విధంగా రఘునాధపాలెం కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ ని చిన్నచిన్న కారణాలవల్ల శాశ్వతంగా విధుల నుండి టెర్మినేట్ చేయడం వల్ల ఆ కుటుంబం రోడ్డున పడ్డదని కావున టెర్మినేషన్ రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ప్రాతినిధ్యం చేసిన వారిలో వీరితోపాటు టిపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు రాయల వీరస్వామి, ప్రసాద్, టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి. నాగేశ్వరరావు ,టిపిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి వెంగళరావు, ఎస్టిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మన్సూర్, యాదగిరి, టిఆర్టిఎఫ్ అధ్యక్షులు మట్టా శ్రీనివాసరావు, టిపిఆర్టియు నాయకురాలు శిరీష తదితరులున్నారు. ప్రాతినిధ్యం పట్ల సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వీలైనంత తొందరగా హెడ్మాస్టర్, యస్ఓ సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకుంటామని ప్రాతినిధ్య బృందానికి తెలియజేశారు.

# యుటిఎఫ్ రాష్ట్ర విద్యా సదస్సు, విస్తృత సమావేశాలు

## గోడపత్రిక విడుదల




**ఖమ్మం ఎడ్యుకేషన్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర విద్యా సదస్సు, రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాల గోడపత్రికలను, కరపత్రాలను టియస్ యుటియఫ్ నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. డిసెంబర్ 28,29 తేదీల్లో జనగామ జిల్లా కేంద్రంలో విద్యా సదస్సు, రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశాలు జరగనున్నాయని వెల్లడించారు. డిసెంబర్ 28 ఉదయం 9.30 లకు పట్టణంలో ఉపాధ్యాయుల మహాప్రదర్శన ఉంటుందని అనంతరం జరిగే ప్రారంభ సభలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, కొండా సురేఖ గార్లు పాల్గొంటారు. పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, ఎమ్మెల్యేలు రాజేశ్వర్ రెడ్డి, కడియం శ్రీహరి, యశస్వినీ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, జెఎసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ ఏలూరి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా విద్యాశాఖాధికారి తదితరులు పాల్గొంటారు. మధ్యాహ్నం జరిగే విద్యా సదస్సుకు పాఠశాల విద్యా డైరెక్టర్ నవీన్ నికోలస్ గారు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ప్రొ. కె నాగేశ్వర్ మాజీ ఎమ్మెల్సీ, ప్రొ మాడభూషి శ్రీధరాచార్యులు, అలుగుబెల్లి నర్సిరెడ్డి వక్తలుగా వివిధ అంశాలపై మాట్లాడతారు. మరుసటి రోజు జరిగే సమావేశంలో విద్యారంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి, రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి, ఉపాధ్యాయుల సమస్యలను సమీక్షించి తగిన కార్యాచరణను సమావేశాల్లో రూపొందించుకుంటామని టిఎస్ యుటిఎఫ్ అధ్యక్షుడు షేక్.రంజాన్, ప్రధాన కార్యదర్శి పారుపల్లి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు బుర్రి.వెంకన్న, రాంబాబు, సురేష్, నాగేశ్వరరావు, రామకృష్ణ, సుధాకర్, గురవయ్య, దామోదర్, రమణ, కృష్ణప్రసాద్, శ్రీదేవి, సంతూలాల్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామిరెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటు

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్



**ఖమ్మం బ్యూరో, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** కూసుమంచి మండల నాయకులు యడవల్లి రామిరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ రామిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ వారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ది 20- 12- 2025 న శనివారం ఉదయం 09.00గంటలకు వారి స్వగ్రామం పాలేరు లో అంత్యక్రియలు నిర్వహించనున్నారని కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# ఎరువుల సమతుల్య వినియోగంపై శిక్షణ కార్యక్రమం



**ఖమ్మం బ్యూరో, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** కృషి విజ్ఞాన కేంద్రం వైరా నందు " పీఎం ప్రణయ్" (భూమి తల్లి పునరుద్దరణ, అవగాహన కల్పన, పోషణ మరియు పెరుగుదల కోసం ప్రధానమంత్రి కార్యక్రమం) లో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం వైరా మరియు రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ భారత ప్రభుత్వం వారి సమన్వయంతో ఎరువుల సమతుల్య వినియోగం పైన రైతులకు శిక్షణ నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణి దేవి, అపరాల పంటలలో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు రసాయనకి ఎరువుల వినియోగంలో పాటించవలసిన మెలకువలు వివరించారు. రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఏరియా మేనేజర్ శ్రీ పురుషోత్తం సింగ్ మాట్లాడుతూ మొక్కలు ఎదుగుదలకు సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యతను వివరించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ కృషి విజ్ఞాన కేంద్రం వైరా డాక్టర్ సుచరిత దేవి భూసార పరీక్ష చేపట్టవలసిన చర్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం వైరా శాస్త్రవేత్తలు పావని. చైతన్య, పణిశ్రీ, జిల్లా వ్యవసాయ భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు బాల ప్రకాష్ రామారావు, ఏరియా మేనేజర్ వంశీ వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ నుంచి గల్ఫ్ కు 50వేల మంది కార్మికులు

**2020-25లో దేశవ్యాప్తంగా 21 లక్షలకుపైగా ఎమిగ్రేషన్ క్లియరెన్సులు**

**యూఏఈ, సౌదీ అరేబియాలే రాష్ట్ర కార్మికుల ప్రధాన గమ్యస్థానాలు**

**వాయు కాలుష్య మరణాలపై స్పష్టమైన ఆధారాలు లేవన్న కేంద్రం**



**న్యూ ఢిల్లీ బ్యూరో, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** విదేశీ ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే కార్మికుల్లో తెలంగాణ కీలకంగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. 2020 నుంచి 2025 డిసెంబర్ 9 వరకూ తెలంగాణ నుంచి మొత్తం 49,879 ఎమిగ్రేషన్ క్లియరెన్స్‌లు (ఈసిలు) జారీ అయ్యాయని కేంద్రం లోక్‌సభలో తెలిపింది. ఈ అంశాన్ని పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి గురువారం లేవనెత్తారు. దీనికి కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దేశంలో వాయు కాలుష్యం మరణాలకు సంబంధించి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సమాధానం తెలిపారు.

తెలంగాణ నుంచి విదేశాల్లో ఉన్న వలస కార్మికుల సంఖ్య ఇలా: తెలంగాణ నుంచి అత్యధికంగా యూఏఈ 18,585 మంది కార్మికులు ఉన్నట్లు కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి తెలిపారు. ఆ తర్వాత సౌదీ అరేబియాలో (11,081), ఒమాన్ (5,910), ఖతార్ (5,304), కువైట్ (4,274) దేశాలు ఉన్నాట్లు పేర్కొన్నారు. ప్రధానంగా నిర్మాణ, సేవారంగాలు, పారిశుధ్య, రవాణా రంగాల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండటమే ఇందుకు కారణమని కేంద్రం వివరించింది. వలస కార్మికుల్లో పురుషులే అధికంగా ఉన్నారని, మహిళల సంఖ్య పరిమితంగానే ఉందని తెలిపారు.

కార్మికుల భద్రత, హక్కుల పరిరక్షణకు దౌత్య కార్యాలయాల ద్వారా పరిరక్షణ

విదేశీ ఉపాధికి వెళ్లే తెలంగాణ కార్మికుల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం ఇ-మైగ్రేట్ పోర్టల్, భారత దౌత్య కార్యాలయాల హెల్ప్‌లైన్లు, ప్రవాసీ భారతీయ సహాయ కేంద్రాలు పనిచేస్తున్నాయని కేంద్రం పేర్కొంది. విదేశాలకు వెళ్లే ముందు అవగాహన శిక్షణ, ఒప్పందాల పరిశీలన, బీమా సదుపాయాలు కల్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. దేశంలో వాయు కాలుష్య మరణాలకు సంబంధించి..

ప్రజారోగ్యానికి సంబంధించి దేశంలో వాయు కాలుష్య తీవ్రత, మరణాల గురించి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జాదవ్ సమాధానం ఇచ్చారు. దేశంలో వాయు కాలుష్యం (పీఎం 2.5) వల్లే మరణాలు సంభవిస్తున్నాయని నిర్ధారించే స్పష్టమైన, తుది ఆధారాలు లేవని కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది. గాలి కాలుష్యం ఆరోగ్యంపై ప్రభావం చూపే అంశాల్లో ఒకటేనని, అయితే ఆహారపు అలవాట్లు, వృత్తి సంబంధిత పరిస్థితులు, సామాజిక-ఆర్థిక స్థితి, వైద్య చరిత్ర, రోగనిరోధక శక్తి, వారసత్వ లక్షణాలు వంటి పలు అంశాల సమ్మేళనంతోనే వ్యాధులు, మరణాలు సంభవిస్తాయని వివరించారు.

# అక్రమ ఓట్ల ఏరివేతే లక్ష్యం

## ఓటర్ల జాబితా ప్రక్షాళనతోనే ప్రజాస్వామ్యానికి రక్షణ

## ఈవీఎంలపై విపక్షాల ఏడుపులు మానుకోవాలి

## ఖమ్మం జిల్లా బిజెపి సమావేశంలో జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి ధ్వజం



**ఖమ్మం బ్యూరో, 19 డిసెంబర్ (కెరటం న్యూస్):** ఓటర్ల జాబితాలో పేరుకుపోయిన అక్రమ ఓట్లను తొలగించి, పారదర్శకమైన ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్మించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని బిజెపి జిల్లా ఇన్చార్జి బద్దం మహిపాల్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని బిజెపి జిల్లా కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా పదాధికారుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు ఎన్నికల సంస్కరణలపై చేస్తున్న అసత్య ప్రచారాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఓటర్ల జాబితా సవరణ అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, దీనిపై ప్రజల్లో అపోహలు సృష్టించడం విపక్షాల దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు.

కాంగ్రెస్ హయాంలో లేని అభ్యంతరాలు ఇప్పుడెందుకు?: గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అనేకసార్లు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించారని మహిపాల్ రెడ్డి గుర్తు చేశారు. నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు అందరూ ప్రధానులుగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ జరిగిందని, అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడు నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపడితే ఎందుకు వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. ముఖ్యంగా 2010లో కాంగ్రెస్ హయాంలోనే రిటర్నింగ్ అధికారుల నుంచి ఓట్ల తొలగింపు అధికారాన్ని తొలగించడం వల్ల జాబితా కలుషితమైందని ఆరోపించారు. చనిపోయిన వారు, ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన వారి పేర్లు అలాగే ఉండటం వల్ల దొంగ ఓట్లకు ఆస్కారం ఏర్పడిందని, దీనిని సరిదిద్దేందుకే 2025లో మళ్ళీ ఈ భారీ ప్రక్షాళన చేపడుతున్నట్లు వివరించారు.

దేశ భద్రతతో చెలగాటం వద్దు..

బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు

ఓటర్ల జాబితాలో విదేశీ చొరబాటుదారులు చోటు సంపాదించడం దేశ భద్రతకే ముప్పు అని బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు హెచ్చరించారు. మన దేశ ప్రధానిని, ముఖ్యమంత్రులను నిర్ణయించే శక్తి చొరబాటుదారుల చేతుల్లోకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనన్నారు. పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఫెన్సింగ్ వేయనివ్వకుండా విపక్షాలు దేశ ప్రయోజనాలను పణంగా పెడుతున్నాయని దుయ్యబట్టారు. హర్యానా ఓట్లపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని, ఓటమి భయంతోనే వారు ఇలాంటి "అణు బాంబు" కథనాలు సృష్టిస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఈవీఎంలపై ద్వంద్వ ప్రమాణాలు: ఎన్నికల్లో ఓడిపోతే ఈవీఎంలను, ఓటర్ల జాబితాలను నిందించడం ప్రతిపక్షాలకు పరిపాటిగా మారిందని నెల్లూరి కోటేశ్వరరావు విమర్శించారు. 1989లో కాంగ్రెస్ హయాంలోనే ప్రవేశపెట్టిన ఈవీఎంల ద్వారా వారు గెలిచినప్పుడు మౌనంగా ఉండి, బిజెపి గెలిచినప్పుడు మాత్రం ఏడుపులు మొదలుపెట్టడం వారి ద్వంద్వ వైఖరికి సాక్ష్యమన్నారు. ఎన్నికల సంఘం ఒక స్వతంత్ర సంస్థ అని, దాని స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా ప్రవర్తించడం తగదని హితవు పలికారు.

కార్యకర్తలే పార్టీకి బలగం: గత 11 ఏళ్లలో నరేంద్ర మోదీ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అద్భుతమైన పథకాలను అమలు చేసిందని, గ్యాస్, తాగునీరు, ఉచిత బియ్యం, వైద్య సదుపాయాలను ప్రతి ఇంటికీ చేరవేసిందని కొనియాడారు. మౌలిక సదుపాయాల కల్పనలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని చెప్పారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అలాగే ఓటర్ల జాబితాలో జరిగే తప్పులను సరిదిద్దేలా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజా మద్దతు బిజెపి వైపే ఉందని, రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, నల్గొండ జిల్లా ఇంచార్జ్ సన్నీ ఉదయ ప్రతాప్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు గుత్తా వెంకటేశ్వరరావు, నాయుడు రాఘవరావు, నల్లగట్టు ప్రవీణ్ కుమార్, సుదర్శన్ మిశ్రా, భానోత్ రవి, నకిరేకంటి వీరభద్రం, వీరవెల్లి రాజేష్, రజినీ రెడ్డి, నెల్లూరి బెనర్జీ, కందుల శ్రీకృష్ణ, బోయినపల్లి సురేష్, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# గంభీర్ కోచ్ కాదు.. జస్ట్ మేనేజర్ : కపిల్ దేవ్



స్పోర్ట్స్ న్యూస్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్): భారత మాజీ కెప్టెన్, 1983 వరల్డ్‌కప్ విజేత కపిల్ దేవ్ టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్(ఐసీసీ) శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న కపిల్ దేవ్... ప్రస్తుత క్రికెట్‌లో హెడ్ కోచ్ పాత్ర ట్రెడిషనల్ కోచింగ్ కంటే ప్లేయర్ మేనేజ్‌మెంట్‌పైనే ఎక్కువగా ఉండాలని అన్నారు. “ఈ రోజుల్లో కోచ్ అనే పదాన్ని చాలా లూజ్‌గా వాడుతున్నారు. గంభీర్ అసలు కోచ్ కాదు, జట్టుకు మేనేజర్ మాత్రమే. స్కూల్, కాలేజీల్లో నేర్పేవాళ్లే నిజమైన కోచ్‌లు. ఇంటర్నేషనల్ స్థాయిలో ఆటగాళ్లు ఇప్పటికే స్పెషలిస్టులు.

లెగ్ స్పిన్నర్‌కు, వికెట్ కీపర్‌కు గంభీర్ ఎలా కోచింగ్ ఇస్తాడు?” అని వ్యాఖ్యానించారు. మేనేజర్‌గా ఆటగాళ్లను ప్రోత్సహించడం, వారిలో నమ్మకం నింపడం, మానసిక సౌకర్యం కల్పించడమే ముఖ్యమని కపిల్ అన్నారు. ఫామ్‌లో లేని ప్లేయర్‌లకు అండగా నిలవడం కెప్టెన్, మేనేజర్ బాధ్యత అని తెలిపారు. గంభీర్ ఇకపై ఈ బాధ్యతలు సరిగ్గా నిర్వర్తించాలని కోరారు. దక్షిణాఫ్రికాతో సొంత దేశంలో 0-2 టెస్ట్ సిరీస్ ఓటమి తర్వాత గంభీర్‌పై తీవ్ర విమర్శలు వస్తున్న నేపథ్యంలో కపిల్ వ్యాఖ్యలు మరోసారి సంచలనం రేపాయి.

# టీ20 ప్రపంచకప్, న్యూజిలాండ్‌తో సిరీస్‌కు.. ఈ తేదీనే జట్లను ప్రకటించనున్న బీసీసీఐ..!



స్పోర్ట్స్ న్యూస్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్): కొత్త ఏడాదిలో భారత్-శ్రీలంక సంయుక్తంగా ఐసీసీ టీ20 ప్రపంచ కప్ జరుగనున్నది. అదే సమయంలో స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లో భారత జట్టు తలపడనున్నది. ప్రపంచకప్, న్యూజిలాండ్‌తో సిరీస్‌కు భారత జట్టును ఎంపిక చేసేందుకు బీసీసీఐ సెలక్షన్ కమిటీ శనివారం సమావేశం కాబోతుందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. రాబోయే బిజీ షెడ్యూల్ నేపథ్యంలో భారత జట్టును ఎంపిక చేసేందుకు ముంబయిలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో సమావేశం జరుగనున్నట్లు తెలిపింది. ఈ సమావేశంలో టీ20 ప్రపంచకప్ కోసం 15 మంది సభ్యులతో జట్టును.. అంతకంటే ముందు న్యూజిలాండ్‌తో జరిగే ఐదు మ్యాచుల టీ20 సిరీస్ కోసం జట్టును ఎంపిక చేయడంపై సెలక్షన్ కమిటీ దృష్టి సారించనున్నది.

సెలక్షన్ కమిటీ ప్రస్తుతం ఉన్న జట్టును కొనసాగించేందుకే మొగ్గు చూపుతుంది. న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేసిన టీ20 జట్టునే ప్రపంచకప్‌లో ఆడించే అవకాశం ఉంది. జట్టులో పెద్దగా ఊహించని మార్పులు ఏవీ ఉండవని భావిస్తున్నారు. 15 మంది సభ్యుల జట్టును ఐసీసీకి ముందుగానే సమర్పించాల్సి ఉన్నప్పటికీ.. టోర్నీ మొదలయ్యే సమయానికి ఆటగాళ్లను మార్చుకునే అవకాశం ఉందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఎవరైనా ఆటగాళ్లు గాయాల బారినపడినా.. ఫామ్‌లో గణనీయమైన మార్పులు ఎదురైనా ఎదుర్కొనేందుకు టీమ్ మేనేజ్‌మెంట్‌కు కొంత వెసులుబాటును కల్పిస్తుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత్ న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు సైతం ఆతిథ్యం ఇస్తుంది. ఇరు జట్లు జనవరి 11 నుంచి 31 వరకు మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడుతాయి. టీ20 ప్రపంచకప్ ఫిబ్రవరిలో మొదలవుతుంది. టీమిండియా తొలి మ్యాచ్‌ను ఫిబ్రవరి 7న ముంబయిలో యూఎస్‌ఏతో ఆడుతుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 12న నమీబియాతో ఢిల్లీలో ఆడుతుంది. ఆ తర్వాత గ్రూప్ దశలో భాగంగా ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడుతుంది. అనంతరం ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లోని భారీ నరేంద్ర మోదీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో చివరి గ్రూప్ మ్యాచ్ ఆడుతుంది. ఇప్పటికే ఐసీసీ షెడ్యూల్‌ను ఖరారు చేసిన విషయం తెలిసిందే.

ఇదిలా ఉండగా.. ప్రపంచకప్‌కు ముందు టీమిండియా కెప్టెన్‌తో పాటు పలువురు ఆటగాళ్ల ఫామ్‌పై ఆందోళన కొనసాగుతున్నది. టీ20 సారథి సూర్య కుమార్ యాదవ్ ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. నిలకడగా పరుగులు లేయలేకపోవడంతో తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి. బ్యాట్‌తో పరుగులు చేయలేకపోయినా కెప్టెన్‌గా రికార్డు బాగుంది. ఈ క్రమంలో ప్రపంచకప్‌లో జట్టును నడిపించేందుకు బీసీసీఐ, సెలక్షన్ కమిటీ సూర్యపైనే నమ్మకం ఉంచే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఇక వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్థానం ప్రశ్నార్థకంగా ఉంది. ప్రపంచకప్ జట్టులో చోటుపై అనిశ్చితి కొనసాగుతున్నది. గిల్ టెస్టులు, వన్డే ఫార్మాట్‌లో సారథిగా కొనసాగుతున్నప్పటికీ.. టీ20లో మాత్రం పెద్ద స్కోర్ లేయలేక ఇబ్బందిపడుతున్నాడు. దాంతో జట్టులో స్థానం ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం, సంజు శాంసన్‌తో పాటు పలువురు యువ ఆటగాళ్ల గిల్ పోటీని ఎదుర్కొంటున్నాడు. గిల్ ఫామ్ మెరుగుపడకపోతే 2024 ప్రపంచకప్ గెలిచిన జట్టులో అత్యద్భుతంగా రాణించిన యశ్వసీ జైస్వాల్ అతని స్థానంలోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# సినిమా హిట్ అయినందుకు కాదు..

## ఓజీ డైరెక్టర్‌కు పవన్ కళ్యాణ్ ఖరీదైన గిఫ్ట్ ఇవ్వడం వెనక కారణం ఇదే..!




మూవీ న్యూస్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్): పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు లైఫ్‌టైమ్ మెమరీగా నిలిచిన సినిమా “ఓజీ”. పవన్‌కు బిగ్గెస్ట్ ఫ్యాన్‌గా పేరొందిన యంగ్ డైరెక్టర్ సుజీత్ ఈ చిత్రాన్ని తెరకెక్కించి, పవన్ ఫ్యాన్స్ హృదయాలను గెలుచుకున్న విషయం తెలిసిందే. సినిమా విడుదలైనప్పటి నుంచి ఇప్పటివరకు సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా “ఓజీ” ప్రస్తావన వస్తూనే ఉంది. ఇలాంటి సినిమాను అందించిన సుజీత్‌కు ఇటీవల పవన్ కళ్యాణ్ ఓ ఖరీదైన లగ్జరీ కారును గిఫ్ట్‌గా ఇచ్చిన విషయం పెద్దగా వైరల్ అయ్యింది. అయితే ఈ గిఫ్ట్ వెనుక ఉన్న అసలు కథ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది.

“ఓజీ” సినిమా షూటింగ్ సమయంలో సుజీత్ కేవలం దర్శకుడిగా మాత్రమే కాకుండా, ప్రాజెక్ట్‌పై తన వ్యక్తిగత ఆసక్తిని పూర్తిగా పెట్టాడని టాక్. సినిమాలోని కొన్ని కీలక ఎలిమెంట్స్‌కు సంబంధించి ముఖ్యంగా ఓజీ కామిక్స్ ఐడియా, విజువల్ డిజైన్, కొన్ని ప్రత్యేక కాన్సెప్ట్‌లు తన సొంత ఖర్చుతోనే సుజీత్ ముందుకు తీసుకెళ్లాడట. బడ్జెట్ పరిమితులున్నప్పటికీ, సినిమాకు ఎలాంటి కాంప్రమైజ్ చేయకూడదనే ఉద్దేశంతో, తనకు ఎంతో ఇష్టమైన లగ్జరీ కారును కూడా అమ్మి షూటింగ్ అవసరాల కోసం డబ్బు వినియోగించాడన్న విషయం అప్పట్లో సినీ వర్గాల్లో వినిపించింది. ఈ విషయం పవన్ కళ్యాణ్ దృష్టికి షూటింగ్ పూర్తైన తర్వాత ఆలస్యంగా వెళ్లిందట. సినిమా కోసం ఒక దర్శకుడు తన సొంత వాహనాన్ని అమ్ముకునే స్థాయికి వెళ్లాడని తెలుసుకున్న పవన్ చాలా ఎమోషనల్ అయ్యారట. అప్పుడు సుజీత్ చేసిన త్యాగాన్ని గుర్తించి, సినిమా పూర్తైన తర్వాత అతడికి మళ్లీ అదే స్థాయి లగ్జరీ కారును గిఫ్ట్‌గా ఇవ్వాలని పవన్ నిర్ణయించుకున్నారని సమాచారం. కారు గిఫ్ట్ విషయం బయటకు రాగానే సోషల్ మీడియాలో పలు రకాల ట్రోల్స్ వచ్చాయి. “కారు ఇచ్చారు కానీ ఈఎంఐ లు మాత్రం సుజీత్‌నే కట్టుకోవాలేమో” అంటూ కొందరు కామెంట్స్ చేశారు. అయితే వాటికి చెక్ చెబుతూ మరో ఇంట్రెస్టింగ్ న్యూస్ బయటకు వచ్చింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం, పవన్ కళ్యాణ్ కేవలం కారు కొనివ్వడమే కాకుండా, దానికి సంబంధించిన ఇన్స్టాల్మెంట్స్ కూడా ప్రతీ నెల ఆయనే భరిస్తారని తెలుస్తోంది. మొత్తానికి, “ఓజీ” సినిమా వెనుక సుజీత్ చూపిన డెడికేషన్‌కు, త్యాగానికి పవన్ కళ్యాణ్ ఇచ్చిన ఈ బహుమతి ఇప్పుడు ఇండస్ట్రీలో అరుదైన సంఘటనగా చెప్పుకుంటున్నారు. ఇది పవన్ కళ్యాణ్ పెద్దతనానికి, టీమ్‌పై ఆయనకు ఉన్న గౌరవానికి మరో ఉదాహరణగా నిలుస్తోంది.

# ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ టీజర్ రిలీజ్ ఇక మాస్ ఫ్యాన్స్ కు పండగే




మూవీ న్యూస్, 19 డిసెంబర్ (కెరటం న్యూస్): మాస్ మహారాజ్ రవితేజ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. మెగాస్టార్ రేంజ్ లో క్రేజ్ సంపాదించిన రవితేజ, ఏడాదికి కనీసం రెండు సినిమాలు రిలీజ్ చేసి దూసుకు వెళ్తున్నారు. హిట్, ఫ్లాప్ అనే సంబంధం లేకుండా కొత్త వాళ్లకు అవకాశం ఇస్తూ, దుమ్ము లేపుతున్నారు. అయితే అలాంటి మాస్ మహారాజ్ రవితేజ ఇప్పుడు కొత్త సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆ సినిమానే భర్త మహాశయులకు విజ్ఞప్తి’. రవితేజ హీరోగా వస్తున్న ఈ సినిమాకు కిషోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్నారు.

ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా ఈ మూవీలో నటిస్తున్నారు. ఈ సినిమా ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రమోషన్స్ చేస్తూ చిత్ర బృందం రచ్చ చేస్తోంది. ఇందులో భాగంగానే ఈ మూవీ నుంచి టీజర్ కూడా రిలీజ్ చేసింది చిత్ర బృందం. వదిన వాళ్ళ చెల్లెలు అంటే నా భార్యగా అంటూ రవితేజ చేసే కామెడీ టీజర్ లో అందరిని ఆకట్టుకుంటుంది. ఒకే సమయంలో ఇద్దరు అమ్మాయిలతో రవితేజ చేసే రొమాన్స్ కూడా చాలా కొత్తగా ఉంది. తాజాగా రిలీజ్ అయిన ఈ టీజర్ సినిమాకు హైప్ పెంచింది. కాగా భర్త మహాశయులకు విజ్ఞప్తిస సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 13వ తేదీన రిలీజ్ కానుంది.